కథ

# గోరంత లాలింత

''నేనేం చేసేను? వాడు తప్పు చేస్తే నన్నంటావెందుకు?'' అన్నాడు చందు పౌరుషంగా.

''వాడు పసివాడు. వాడికేం తెలుసు? ఫ్లవర్‌వేజ్ పగలకొడుతుంటే చూస్తూ ఊరుకుంటావా? ఇంకా నయం ఒక్కక్షణం వుంటే వాడు గాజు ముక్కలు తీసి నోట్లో పెట్టుకునేవాడు'' అంది ఆమని.

''వాడు పగలకొట్టడం నేను చూడలేదు. నా హోంవర్క్ చేసుకుంటున్నాను'' అన్నాడు.

కొడుకు మొండి జవాబుకి విస్తుపోయింది ఆమని. వాడు ఈ మధ్య ప్రతి విషయంలోనూ ఎందుకిలా ప్రవర్తిస్తున్నాడో ఆమెకు అర్థం కావడంలేదు.

చందూ వయస్సు ఆరు సంవత్సరాలు. సెకెండ్ క్లాస్ చదువుతున్నాడు. ఎంతో చురుకైనవాడు. మంచి తెలివితేటలున్నాయి. క్లాస్‌లో ఫస్ట్‌రేంక్. ఏ విషయమైనా ఇట్టే గ్రహిస్తాడు. అయితే వాడీ మధ్య డల్‌గా తయారయ్యాడు. విచిత్రంగా బిహేవ్ చేస్తున్నాడు. అదే ఆమనికి అంతుపట్టడం లేదు.

ఆమె రెండో కొడుకు మనూ ఏడాదివాడు. చాలా దుడుకు. ప్రతీ వస్తువూ పీకి పాడు చేస్తాడు. ఆ రోజు ఉదయం వాడు టీవీ రిమోట్‌ని నేలకేసి కొట్టి ముక్కలు చేసేడు. ఇప్పుడు ఫ్లవర్‌వేజ్ పగలకొట్టి ఆ గాజు పెంకుల మధ్య కూర్చున్నాడు. వాడు చేస్తున్న పాడు పనులు చూస్తూ చందూ వాడిని వారించకపోవడం, దురుసుగా ఎదురు జవాబులు చెప్పడంతో ఆమెకు కొడుకుపైన కోపం వచ్చింది. కర్తవ్యం వెన్ను తట్టడంతో తమాయించుకుని మనూని గాజుముక్కల మధ్య నుండి తీసి ఎత్తుకుని ఒళ్ళంతా శుభ్రం చేసింది. వాడిని బెడ్‌రూమ్‌వద్ద కూర్చోబెట్టి ఆడుకునేందుకు ఆట వస్తువులు వాడిముందు పడవేసి డ్రాయింగ్ రూమ్‌లో గాజుముక్కలు తుడవడానికి చీపురు తేబోయింది.

మనూ గబగబా డ్రాయింగ్ రూమ్‌లోకి పాకుతూ వచ్చి చందూ స్కూల్ బేగ్‌లో పుస్తకాలు పీకుతున్నాడు. చందూ చప్పున తన స్కూల్ బేగ్ ఒక చేత్తో అందుకుని తమ్ముడి చేతిలోవున్న పుస్తకం విసురుగా తీసుకున్నాడు. దాంతో వాడు తన రెండు చేతులతోనూ చందూ జుట్టు గట్టిగా పట్టుకున్నాడు.

''మమ్మీ!'' అని అరుస్తూ వాడు తమ్ముడి చేతిలోంచి విడిపించుకో ప్రయత్నిస్తున్నాడు.

ఆ దృశ్యం చూసిన ఆమని చేతిలో చీపురు జారవిడిచి వాళ్ళిద్దర్నీ విడదీసింది.

''మైగాడ్! ఏమిటి అక్కా! ఇంటినిండా ఈ గాజుముక్కలు?'' అంటూ భుజానికి వున్న బేగ్ టీపాయ్ మీద వుంచి చీపురు అందుకుని గాజుముక్కలు తుడిచి బయట పారవేసి వచ్చింది మందాకిని.

''ఏం చెప్పవంటావ్ ఈ వాలీ సుగ్రీవుల నిర్వాకం? ఇద్దరు చేరి ఇల్లు పీకి పందిరి వేస్తున్నారు. పనిపిల్ల ఈ రోజు నాగా పెట్టింది. చంటాడు ఒక్క నిముషం ఎక్కడా కుదురుగా వుండడు'' అంది.

రెండో కొడుకుని ఆడించడానికి పనిపిల్లని పెట్టుకుంది ఆమని. ఆ పిల్ల ప్రతిదినం ఆరుగంటలకు వచ్చి సాయంత్రం ఆరుగంటలవరకూ వుండి పిల్లాడిని జాగ్రత్తగా ఆడిస్తుంది. వాడికి దానివద్ద చేరిక ఎక్కువ. దాని మాట చక్కగా వింటాడు. ఆ పిల్ల ఎన్నడూ నాగా పెట్టలేదు. ఈ రోజు నాగా పెట్టింది.

మందాకినిని చూసి కేరింతలు కొడుతున్న మనూని ఎత్తుకుని బేగ్‌లోంచి పాలకోవా తీసి వాడి నోట్లో పెట్టింది. వాడు కోవా చప్పరిస్తూ చందూవేపుచూసి 'న్నా...న్నా...న్నా'' అంటున్నాడు సంతోషంగా.

''పో! నీ జట్టు చీక్' అన్నాడు చందూ తమ్ముడితో.

''అదేమిట్రా! పాపం వీడు అన్నా అన్నా అని నిన్ను పిలుస్తూంటే'' అంది మందాకిని.

''అదికాదు పిన్నీ. వీడు తప్పు పని చేయడం, మమ్మీ నన్ను తిట్టడం'' అన్నాడు పౌరుషంగా.

''చందూ! బేగ్‌లో ఫైవ్‌స్టార్ చాక్‌లెట్ బార్ వుంది తీసుకో'' అంది మందాకిని. వాడికి ఆ చాక్లెట్లు ఎంతో ఇష్టం.

''తరువాత తీసుకుంటాను'' అన్నాడు ఏమాత్రం ఇంటరెస్ట్ ప్రదర్శించకుండా.

''హాయ్ చందూ!'' అంటూ వాడి ఫ్రెండ్స్ నిఖిల్, అరవింద్, గోపీ, నీరజ్ మరో ముగ్గురు పిల్లలు వచ్చారు. అంతా ఒకే ఈడువారు. ప్రతి సాయంత్రం వాళ్ళందరూ వాళ్ళ లాన్‌లో చీకటి పడేవరకూ ఆడుకుంటారు.

మందాకిని అందరికీ చాక్లెట్లు ఇచ్చింది. పిల్లలంతా ''థాంక్స్'' చెప్పి తీసుకున్నారు.

''ఆంటీ! చందూ ఈ ఇయర్ అంతా వరుసగా అన్ని యూనిట్ టెస్టుల్లో ఫస్ట్ ర్యాంక్ వచ్చాడు. అందుకు పేరెంట్స్ డే ఫంక్షన్‌లో చందూకి స్పెషల్ ప్రైజ్ ఇస్తారని మా టీచర్ ఈ రోజు క్లాసులో చెప్పారు'' అన్నాడు నీరజ్.

''ఈజిట్? కంగ్రాట్యులేషన్స్'' అంటూ చందూని అభినందించి కిస్ చేసింది మందాకిని.

''ఏరా! ఈ విషయం ఇంతవరకూ చెప్పలేదేం?'' అంది ఆమని కొడుకు సాధించిన విజయానికి ఆనందిస్తూ.

''మర్చిపోయాను'' అన్నాడు వాడు నిర్లక్ష్యంగా.

అక్కాచెల్లెళ్ళిద్దరూ ఒకరి ముఖాలొకరు చూసుకున్నారు వాడి జవాబు విని.

''వీడిలా తయారయ్యాడేమిటి అక్కా?'' అంది మందాకిని.

''ఏమోనే! అదే మాకూ అర్థం కావడంలేదు.''

''బాగుంది అక్కా. నువ్వేమో ఎమ్.ఎ సైకాలజీ చేశావు.''

''చాల్లే సంబడం. మీ బావగారికీ, నీకూ సమయం దొరికితే చాలు నన్ను ఆట పట్టించడానికి'' అంది ఉక్రోషంగా.

''అది కాదు అక్కా! వాడిని ఈ స్టేజిలో అలా పట్టించుకోకుండా వదిలేస్తే వాడు పాడైపోతాడు. ఈకాలం పిల్లలు మాటంటే అసలు పడరు. వారిని మంచి మాటలతోనే లొంగదీయాలి. ప్రతీ చిన్న విషయానికీ వారిని తప్పు పట్టి చిరాకుపడ్డం, కసరడం చేయకూడదు. వారు తప్పు పని చేసినా ఎంతో ఓర్పుతో, నేర్పుగా వారు చేసింది తప్పు పని అని వారికి తెలిసే విధంగా నచ్చచెప్పాలి. వారు కోరుకునేది గోరంత లాలింత, ఆప్యాయత, అభిమానం'' అంది మందాకిని.

''అది కాదు అక్కా! వాడిని ఈ స్టేజిలో అలా పట్టించుకోకుండా వదిలేస్తే వాడు పాడైపోతాడు. ఈకాలం పిల్లలు మాటంటే అసలు పడరు. వారిని మంచి మాటలతోనే లొంగదీయాలి. ప్రతీ చిన్న విషయానికీ వారిని తప్పు పట్టి చిరాకుపడ్డం, కసరడం చేయకూడదు. వారు తప్పు పని చేసినా ఎంతో ఓర్పుతో, నేర్పుగా వారు చేసింది తప్పు పని అని వారికి తెలిసే విధంగా నచ్చచెప్పాలి. వారు కోరుకునేది గోరంత లాలింత, ఆప్యాయత, అభిమానం'' అంది మందాకిని.

చెల్లెలి మాటలకు కాస్త గిల్టీగా ఫీలైంది ఆమని. ఆమెకు కాఫీ కలిపి ఇచ్చి వంట ప్రయత్నంలో నిమగ్నమైంది.



ఆమని భర్త సారధి బేంక్ ఆఫీసర్. విజయవాడకు కేంప్ వెళ్లాడు. సాయంగా వుండడానికి రమ్మనమని చెల్లెలు మందాకినికి ఫోన్ చేస్తే వచ్చింది. మందాకిని ఎమ్ఎ పిహెచ్‌డి చేసి ఇంగ్లీష్ లెక్చరర్‌గా జాబ్ చేస్తోంది. తల్లిదండ్రుల వద్ద అదే ఊర్లో వుంటోంది. ఇంకా పెళ్లికాలేదు.

మందాకిని మనూని తీసుకుని లాన్‌లో పిల్లలు ఆడుకుంటున్న చోట వాడిని విడిచి పెట్టింది. వాడు తప్పటడుగులు వేస్తూ పడుతూ లేస్తూ కేరింతలు కొడుతూ లాన్‌లో ఆడుకున్నాడు.

పిల్లలంతా కాసేపు ఆడి అలసి లాన్‌లో కూర్చున్నారు.

''మీకో మంచి గేమ్ చెబుతా రండి'' అని పిల్లలందర్నీ డ్రాయింగ్ రూమ్‌లోకి తీసుకుని వెళ్లింది మందాకిని.

''ఇది మెమరీ టెస్ట్ గేమ్'' అని అక్కడున్న టేబుల్ మీద పెన్ను, పెన్సిల్, ఎరేజర్, ఇంక్ బాటిల్, క్లిప్పు, రిస్ట్ వాచ్, పిన్ను, దువ్వెన వాళ్లకి పరిచయంవున్న ఇరవై వస్తువులు పెట్టింది.

''మీరు ఆ టేబుల్‌మీద వున్న వస్తువులు రెండు నిముషాలసేపు చూసి జ్ఞాపకం వుంచుకుని వాటి పేర్లు దూరంగా కూర్చుని రాసి నాకు చూపించాలి. అన్నీ ఎవరు కరెక్ట్‌గా రాస్తే వారికి మంచి బహుమతి ఇస్తాను'' అంది.

అందరూ రెడీ అనగానే వాళ్ళను టేబుల్ దగ్గరకు వెళ్ళమని రెండు నిముషాలు అవగానే చెప్పింది. వారు వస్తువులు చూసి వచ్చి వాటి పేర్లు రాసి ఆమెకు చూపించారు.

చందూ ఇరవై వస్తువుల పేర్లు కరెక్ట్‌గా రాసాడు. మిగతా పిల్లలు పదిహేను వస్తువుల పేర్లకంటే ఎక్కువ రాయలేకపోయారు. వారు మరచిపోయి రాయలేకపోయిన వస్తువుల పేర్లు తరువాత చెక్ చేసుకున్నారు. అందరూ 'చందూ మెమరీ టెస్టులో ఫస్ట్'' అని ఒప్పుకుని అభినందించారు.

మందాకిని చందూకి చక్కటి పెన్ను బహూకరించి, గేమ్‌లో పాల్గొన్నవారికి పెన్సిళ్ళు ఇచ్చింది. ఆ గేమ్ పిల్లలకెంతో నచ్చింది. వారంతా దానిని గురించే చర్చించుకుంటూ మందాకినికీ, చందూకి టాటా చెప్పి వెళ్లిపోయారు.

వాళ్లంతా వెళ్లిపోయాక మందాకిని చందూని దగ్గర కూర్చోబెట్టుకుని వాడి మెమరీని మరోమారు మెచ్చుకుంది. వాడి స్కూలు, టీచర్స్, చదువూ, ఫ్రెండ్స్‌లాంటి విషయాలెన్నో అడిగింది.

వాడు ప్రతీదీ ఎంతో ఉత్సాహంతో ఆమెకు చెప్పాడు.

''మరి నువ్వు మీ క్లాసులో అన్ని యూనిట్ టెస్ట్‌ల్లోనూ ఫస్ట్ వచ్చినందుకు నీకు పేరెంట్స్ డే నాడు ప్రైజ్ ఇస్తారని మీ క్లాస్ టీచర్ ఈ రోజు చెప్పిన విషయం ఎలా మర్చిపోయావు'' అది చాలా కేజువల్‌గా.

''నేనేం మర్చిపోలేదు'' అన్నాడు వాడు ఠక్కున.

''అంటే మమ్మీతో అబద్ధం చెప్పావు. అవునా?'' అంది నవ్వుతూ.

వాడు కొద్దిగా గిల్టీగా ఫీలై అవునని ఒప్పుకున్నాడు.

''ఏం? ఎందుకని?''

''నా ప్రైజ్ సంగతి మమ్మీకి ఎందుకు చెప్పాలేంటి? మమ్మీకి నేనంటే ఇష్టంలేదు'' అన్నాడు.

''అదేమిట్రా! తప్పు అలా అనకూడదు'' అంది.

''నిజం పిన్నీ! మమ్మీకీ, డాడీకి నేనంటే అసలు ఇష్టం లేదు. వాళ్లకి తమ్ముడంటేనే ఇష్టం. చూడు కావలిస్తే డాడీ ఆఫీసునుంచి రాగానే రోజూ వాడితోనే ఆడుకుంటారు. వాడితోనే కబుర్లు చెప్పి వాడినే ముద్దులాడుతారు. తన దగ్గర వాడినే పడుకోబెట్టుకుంటారు. వాడు తప్పు పని చేసినా మమ్మీ నన్నే తిడుతుంది ఎప్పుడూ'' బొంగురుపోయిన గొంతుకతో చందూ అంటున్న మాటలకు షాక్ అయ్యారు అక్కాచెల్లెళ్లు.

తన తప్పేమిటో తెలిసివచ్చింది ఆమనికి.

☆

రావి- ఎన్- అవధాని